# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర విజన్‌ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

3. **గ్రామీణ ప్రాంతాలకు నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో ఉపాధ్యాయ నియామకాల కోసం అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ వెల్లడించింది.**

==========================

వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర విజన్‌ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను ముఖ్యమంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ, సాంకేతికత ఆధారిత పాలన, వాట్సాప్ గవర్నెన్స్, ఆర్టీజీఎస్ వ్యవస్థల ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నాయుడు తెలిపారు.

------------------------

గనుల తవ్వకం రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లిలోని గ్రానైట్ క్వారీని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకొచ్చి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిలిచిపోయిన మైనింగ్ లీజులను పునరుద్ధరించి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---

తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి అనంతరం ప్రధానమంత్రితో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడంలో కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.అలాగే, హైదరాబాద్ మెట్రో రైల్ రెండవ దశ విస్తరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు.

---

పేద ప్రజలకు వైద్య భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో 49 మంది లబ్ధిదారులకు 32 లక్షల 42 వేల రూపాయల విలువైన సహాయనిధి చెక్కులను ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండేళ్లలో 433 మందికి 4 కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సాయం అందించామని తెలిపారు. పేదల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సహాయ నిధి ద్వారా వేగంగా ఆర్థిక సాయం అందిస్తోందని మంత్రి పేర్కొంటూ..

వాయిస్..30..సెకన్లు

---

గ్రామీణ ప్రాంత ప్రజలకు లో ఓల్టేజీ సమస్యల్లేకుండా, నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి నిన్న ప్రారంభించారు. జమ్మలమడక, వెలమవారిపాలెం గ్రామాల్లో 'సూర్యఘర్' పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సౌర ఫలకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారందరికీ ఉచితంగా 200 యూనిట్ల రూఫ్ టాప్ సోలార్ ప్యానళ్లను అందిస్తామని చెప్పారు.

---

దేశ పారిశ్రామిక రంగంలో కోల్ గ్యాసిఫికేషన్ నూతన అధ్యాయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ నిర్వహించిన కోల్ గ్యాసిఫికేషన్ రోడ్‌షోలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కోల్ గ్యాసిఫికేషన్ 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అధిక బూడిద శాతం ఉన్న దేశీయ బొగ్గుతో గ్యాసిఫికేషన్ సాధ్యం కాదనే అభిప్రాయాన్ని హైదరాబాద్ శాస్త్రవేత్తలు తప్పు అని నిరూపించారని చెప్పారు. సింగరేణి వద్ద ఉన్న అపారమైన బొగ్గు నిల్వలను గ్యాసిఫికేషన్ ద్వారా వినియోగిస్తే సుమారు మూడు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించవచ్చని వెల్లడించారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని ఆయన తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్ లో ఉపాధ్యాయ నియామకాల కోసం అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అమరావతిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, డీఎస్సీ-2025 నియామక ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించామని స్పష్టం చేశారు. డీఎస్సీ ఎంపికల్లో ఎలాంటి అక్రమాలు, పేపర్ లీకేజీలకు అవకాశం లేదని తెలిపారు. అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కారానికి మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు కోన శశిధర్ వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యులుగా తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ,సానా సతీష్, లింగమనేని రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు పూర్తి కావడంతో, నాలుగు స్థానాలకు నలుగురు అభ్యర్థులే పోటీలో ఉండటంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైందని రిటర్నింగ్ అధికారి వనితా రాణి తెలిపారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు ఎన్నికల ధృవీకరణ పత్రాలను అమరావతిలోని అసెంబ్లీ భవనంలో నిన్న అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలనలో వివిధ వర్గాలకు జరిగిన అన్యాయాలను నిరసిస్తూ ఈ ర్యాలీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు సహా వివిధ వర్గాల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజల తరఫున ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై తమ నిరసనను వ్యక్తం చేయనున్నట్లు చెప్పారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంలో అన్యాయం జరిగిందన్న అభ్యర్థులకు సంఘీభావం తెలిపే ఉద్దేశంతో కూడా ఈ నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా ఉడుమాల్పురం గ్రామంలో నిర్వహించిన “మీ భూమి-మీ హక్కు” కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భూముల రీసర్వే పూర్తిచేసి రైతులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. నూతన పాస్‌పుస్తకాల్లో భూ యజమాని ఫోటో, ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటాయని చెప్పారు. క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలు, సరిహద్దులు తెలుసుకోవచ్చని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, తెలంగాణ మీదుగా అంతర కర్ణాటక వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులపాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారిణి జి.లక్ష్మీ తెలియజేస్తూ,

వాయిస్..25.. సెకన్లు

తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

-----------------------------

కళలకు, కళాకారుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న "కళా సమ్మేళన్––2026" సంగీత, నృత్య మహోత్సవాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కళలు, సంస్కృతికి పెద్దపీట వేస్తూ.. వివిధ సాహితీ, సాంస్కృతిక పురస్కారాలను అందజేస్తున్నామని చెప్పారు.

=======================